క్లుప్తంగా

దావాలపేటలో వైద్య శిబిరం



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని దావాలపేట గ్రామంలో గురువారం 104 వైద్యశిబిరం నిర్వహించారు.మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ, వైద్య సిబ్బంది 83మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి రాలేకపోయిన వృద్ధులు, బెడ్‌రెస్ట్ రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య తనిఖీలు చేశారు.

గోదాదేవిగా రాజరాజేశ్వరి



పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: మార్గశిరమాసంలోని మూడో గురువారం సందర్భంగా దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు గోదాదేవిగా దర్శనం ఇచ్చారు. అర్చకులు దూసి శ్రీదర్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీల్లో చిన్నారుల ప్రతిభ



విజేతలకు బహుమతులు అందిస్తున్న మందిర నిర్వాహకులు

చీపురుపల్లి: గీతా జయంతి సందర్భంగా స్థానిక గీతా మందిరంలో ఇటీవల నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈ శ్లోకాల పోటీల్లో పాఠశాలకు చెందిన గొర్లె చందు ద్వితీయస్థానంలో, జి.చిత్ర తృతీయస్థానంలో నిలిచారు. అలాగే ముల్లు చేతన, సారిపల్లి యోగిత కన్సొలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. ఈ మేరకు విజేతలకు మందిర నిర్వాహకులు ప్రకాష్, వెంకటరావు గురువారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించండి

• ఎంఈఓ ఎం.వెంకటరావు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గజపతినగరం: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఎంఈఓ ఎం.వెంకటరావు అన్నారు. మండలంలోని మరుపల్లి బాలాజీ పాలిటెక్నికల్ విద్యాసంస్థలో గురువారం ఏర్పాటు చేసిన విజయనగరం, మన్యం జిల్లాల ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు మెడిటేషన్, క్రీడా రంగాల్లో రాణించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ నెల 21 వరకు నిర్వహించనున్న శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జామి మండలం ఎంఈఓ-2 కె.గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందిపెట్టొద్దు

దత్తిరాజేరు: ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు పెట్టవద్దని ఏఓ అనురాధ మిల్లర్లకు సూచించారు. కోమటిపల్లి, పెదమానాపురం, వంగర గ్రామాల్లోని రైస్ మిల్లుల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. మిల్లర్లతో ఏఓ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని వర్షాలకు తడవకుండా జాగ్రత్తలు తీసుకుని వాహనాలతో మిల్లులకు తెస్తున్నారని, వారిని ఇబ్బంది పెట్టకుండా వెంట వెంటనే అన్‌లోడ్ చేయాలని కోరారు.అన్‌లోడ్ అయిన వెంటనే రసీదులు ఇవ్వాలని మిల్లు యజమానులకు సూచించారు.

పశుగ్రాసం సాయం..
ఏడాదికే పరిమితం



పశుగ్రాస క్షేత్రం (ఫైల్ ఫోటో)

- ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంపకానికి ఆర్థిక సహాయం
- రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న పశుసంవర్ధక శాఖ
- నీటి సౌకర్యం ఉన్న రైతులకు అవకాశం
- గతంలో మూడేళ్ల పాటు సహాయం
- ప్రస్తుతం ఏడాదికే పరిమితం

బొండపల్లి: పశుగ్రాసం పెంపకానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశు సంవర్ధక శాఖ ఆర్థిక సహాయం అందజేస్తోంది. పాల ఉత్పత్తిని పెంచడ మే కాకుండా పశువులకు మేత కొరత లేకుండా చేసేందుకు ఈ పథకం అమలు చేస్తున్నారు. పాడిపశువులు, సాగునీటి సౌకర్యం ఉన్న రైతులకు బహు వార్షిక పశుగ్రాసాలను పెంచడానికి ప్రభుత్వం కొత్త నిబంధనలను ఖరారు చేసింది. గతంలో పశుగ్రాస క్షేత్రాల పెంపకానికి సాగునీటి సౌకర్యం ఉండి, ఎన్ని ఎకరాల భూమి ఉన్న రైతులైనా ఈపథకానికి అర్హులే. పశుగ్రాసం పెంపకానికి మూడేళ్ల పాటు నిధులు అందించే వారు. ప్రస్తుతం ఈ నిబంధనలను మార్చారు. గతంలో మూడేళ్ల పాటు అందించిన ఆర్థిక సహాయాన్ని ఏడాదికి కుదించగా, 5 ఎకరాల్లోపు భూములున్న ఎస్సీ,ఎస్టీతో పాటు మిగతా సన్న, చిన్నకారు రైతులు మాత్రమే అర్హులని బంధన పెట్టారు. అలాగే ఒక్కో రైతు 10 సెంట్ల నుంచి 50 సెంట్లలోపే సాగు చేయడానికి అవకాశం కల్పించారు. పశుగ్రాస క్షేత్రాల నిర్వహించాలనుకునే రైతులు తప్పనిసరిగా దరఖాస్తుతో పాటు ఉపాధి హామీ జాబ్ కార్డు, భూముల వన్‌బీ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా,రేషన్ కార్డు జెరాక్స్‌లు జత చేసి పశువైద్యాధికారులకు కానీ, రైతుసేవా కేంద్రాల్లో కానీ అందజేయాలి. ఈదరఖాస్తులను పశు సంవర్ధకశాఖ అధికారులు పరిశీలించిన తర్వాత అర్హులను ఎంపిక చేస్తారు.

విస్తీర్ణం ఆధారంగా ఏడాదికి అందించనున్న ఆర్థిక సహాయం వివరాలు

ఖర్చు ఇలా..	50 సెంట్లకు	30సెంట్లకు	10సెంట్లకు
వేతనదారుల ఖర్చు	రూ.15,000	రూ.9,000	రూ.3,000
మెటీరియల్ ఖర్చు	రూ.17,992	రూ.10,795	రూ.3,599
మొత్తం	రూ.32,992	రూ.19,795	రూ.6,599

ఏడాదికి మాత్రమే ఆర్థిక సహాయం

బహువార్షిక పశుగ్రాసం పెంపకానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ఆసక్తి ఉన్న రైతులు తమ సమీపంలోని పశువైద్యశాలలో అధికారులకు కానీ, రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు అందజేయాలి. ఏడాదికి మాత్రమే ఆర్థిక సహాయం అందిస్తాం.

– కె.కిరణ్‌కుమార్, బొండపల్లి పశువైద్యాధికారి

పశుగ్రాసాల సాగుకు ప్రోత్సాహం

• పశుసంవర్ధక శాఖ ఏడీఏ చలపతిరావు



పశువులకు తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ చలపతిరావు

వేపాడ: ఉపాధి హామీ పథకంలో భాగంగా బహువార్షిక పశుగ్రాసాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పశుసంవర్ధక శాఖ ఏడీఏ చలపతిరావు తెలిపారు. మండలంలోని బానాదిలో గురువారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వాటికి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బహువార్షిక పశుగ్రాసాల సాగులో భాగంగా వ్యక్తిగతంగా 10 సెంట్ల నుంచి 50 సెంట్లలో గ్రాసం పెంచుకోవచ్చన్నారు. ఏడాది కాలానికి కూలీల వేతనం, మెటీరియల్ ఖర్చు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం బానాది రైతుసేవా కేంద్రంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించండి



శృంగవరపుకోట: కొత్తూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి



బొండపల్లి: బి.రాజేరులో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు



గజపతినగరం: సాలిపేటలో ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ రత్నకుమార్, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు

బొండపల్లి: రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి అందుతున్న అర్జీలను పరిశీలించి వారి భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎంపీపీ చల్లా చలంనా యుడు అధికారులకు సూచించారు. బి.రాజేరు గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పలువురు రైతులు తమ భూసమస్యలపై తహసీల్దార్ డోలా రాజేశ్వరరావుకు అర్జీలు అందజేశారు. సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ, వీఆర్‌ఓ గెద్ద నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగించుకోండి

శృంగవరపుకోట: భూసమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సూచించారు. కొత్తూరు గ్రామంలో తహసీల్దార్ అరుణకుమారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతాంగానికి ఇబ్బందులు లేకుండా వారి భూయాజమాన్య హక్కులు కాపాడేలా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. అధికారులు సదస్సులను మొక్కుబడిగా కాకుండా, సమస్యల్ని పరిష్కరించేదిశగా పనిచేయాలని ఆదేశించారు.

చౌదంతివలసలో..

దత్తిరాజేరు: మండలంలోని చౌదంతివలస గ్రామంలో తహసీల్దార్ విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. చౌదంతివలసతో పాటు పరిసర గ్రామాల రైతులు తమ భూసమస్యలపై అర్జీలు అందజేశారు.స్థానిక పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

గుడివాడలో..

వేపాడ: మండలంలోని గుడివాడలో తహసీల్దార్ రాములమ్మ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 13 మంది రైతులు భూసమస్యలపై అర్జీలు అందజేశారు. నోడల్ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతులు తమ భూసమస్యలు పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడుతున్నాయన్నారు. ఆర్‌ఐ రామలక్ష్మి, వెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాలిపేటలో..

గజపతినగరం: మండలంలోని సాలిపేట గ్రామంలో తహసీల్దార్ రత్నకుమార్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పలువురు రైతులు భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు అర్జీలు అందజేశారు. సర్పంచ్ గంట్యాడ కళావతి, గ్రామ పెద్దలు గంట్యాడ పైడిపునాయుడు పాల్గొన్నారు.

పండ్లతో అమ్మవారికి అలంకరణ



పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: మండలంలోని అంబటివలస రామాలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.రామాలయంలో లక్ష్మీదేవి అమ్మవారిని అర్చకులు గురువారం వివిధ రకాల పండ్లు, పూలతో అలంకరించారు. గ్రామస్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

రైతులు అప్రమత్తం..

గజపతినగరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఈ నెల 25 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.మహరాజన్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కోత కోసి పొలంలో ఉన్న వరి పనలు తడిచినట్లయితే ఆ గింజలు మొలకెత్తకుండా ఉండడానికి లీటర్ నీటిలో 50 గ్రాముల కళ్ల ఉప్పును కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. నూర్చిన ధాన్యం తడిసినట్లయితే రెండు,మూడు రోజులు ఎండబెట్టాలన్నారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి..

నెల్లిమర్ల రూరల్: మామిడి పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం, నెల్లిమర్ల మండలాల ఉద్యానవన శాఖాధికారి డి.జ్యోత్స్న అన్నారు. మండలంలోని కొండవెలగాడలో గురువారం ఆమె పర్యటించి మామిడి రైతులకు బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఎకరానికి రూ.2 వేలు చొప్పున మీ సేవా కేంద్రాల్లో చెల్లించి మామిడి పంటకు బీమా చేయించుకోవాలన్నారు. అధిక, అకాల వర్షపాతం, చీడపీడలు, ఉష్ణోగ్రత వ్యత్యాసాలు, తదితర కారణాలతో పంట పోతే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని చెప్పారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 31 లోపు బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత వేణుగోపాలం

శృంగవరపుకోట: రానున్న ఎన్నికల నాటికి ఎస్.కోటలో మనం బలోపేతం కావాలి.. స్వతంత్రంగా పోటీచేసే స్థాయికి చేరాలని, స్థానిక, సంస్థాగత ఎన్నికల్లో పోటీచేసే సత్తా సాధించాలని భారతీయజనతా పార్టీ నాయకులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్.కె.గ్రాండ్‌లో కె.ఎల్.రామకోటి నేతృత్వంలో గురువారం నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, పార్లమెంట్ కన్వీనర్ ఎస్.లక్ష్మీనరసింహం, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరంగం దానేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్మలు ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాలం మాట్లాడుతూ నాలుగు నెలలుగా పార్టీ సాధారణ సభ్యత్వాలు, క్రియాశీల సభ్యత్వాలు పూర్తి చేసిందని, మండల కమిటీలు, బూత్ కమిటీల నిర్మాణం పటిష్టం చేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీసేసే బలమైన వ్యక్తులను ఎంపిక చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలమైన పార్టీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

● సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటరామన్ అన్నారు. సుస్థిరాభివృ ద్ధి లక్ష్యాలపై కొత్తవలస మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులకు మండల కేంద్రం లోని ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి.అతిథిగా హాజరైన జెడ్పీ డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ ప్రజారోగ్యం, బాలల వికాసం,సాంఘిక భద్రత, పేదరికం నిర్మూలన, జీవనోపాధులు మెరుగుపరచడంపై దృష్టి సారించాలని సూచించారు.ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, శిక్షణ పరిశీలకులు నాగరాజు, కో-ఆర్డినేటర్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

– కొత్తవలస

● లింగ వివక్షను రూపుమాపుదాం



ప్రతి ఒక్కరూ లింగవివక్షతను వ్యతిరేకించాలని, సమాజంలో ఈ సమస్యను రూపుమాపేందుకు కృషిచేయాలని డీఎల్ఎంపీ స్వామినాయుడు కోరారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో వేపాడ మండలంలోని నగుడిపాల, నీలకంఠరాజపురం గ్రామాల్లో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళలు, బాలబాలికల హక్కులు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆయా గ్రామాల ప్రజలతో కలిసి మానవహారంగా ఏర్పడి లింగవివక్షతకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశా రు. ఎంఎంటీఎల్ వసంత, ఎంటీ సన్యాసమ్మ, ప్రకతివ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ నారాయణమ్మ, ఐసీఆర్‌పీలు దేముడు,వెంకటరావు పాల్గొన్నారు.

– వేపాడ

● పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండండి



క్షయ బారినపడకుండా ఉండేందుకు పొగాకు ఉత్పత్తులకు, మద్యం,చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్యలక్ష్మి సూచించారు. చీపురుపల్లి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ లలిత ఆధ్వర్యంలో గరివిడి మండలం, కోడూరు పరిధిలో ఉన్న మోర్ ఎల్లాయిస్ కంపెనీలో కార్మికులకు గురువారం అవగాహన కల్పించడంతో పాటు 54 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేశారు. అలాగే కొండలక్ష్మీపురం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ లక్షణాలను, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

– చీపురుపల్లిరూరల్(గరివిడి)

మహిళలకు రక్షణగా చట్టాలు

డెంకాడ: మహిళలకు రక్షణగా అనేక చట్టాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాదులు పీవీ వరలక్ష్మి, ఏపీఎల్ పద్మజ అన్నారు. జిల్లా జడ్జి బి.సాయి కల్యాణ చక్రవర్తి ఆదేశాల మేరకు జాతీయ మహిళా కమిషన్, జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహహింస, మనోవర్తి, మహిళల పట్ల జరుగుతున్న లైంగిక అత్యాచారాలకు సంబంధించిన చట్టాలపై వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. గుడ్, బ్యాడ్ టచ్, మహిళలకు ఆస్తిహక్కు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా న్యాయ సేవా సంస్థని సంప్రదించవచ్చని, టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఏడీఏ ఎ.నాగభూషణం, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కల్లాజీరావు, వివిధ విభాగాలకు చెందిన జన్య, అరుణ్‌కుమార్, తదతరులు పాల్గొన్నారు.

డీలర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానం



గంట్యాడ: తహసీల్దార్ కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల చేస్తున్న సీఎస్‌డీటీ మూర్తి

మెరకముడిదాం: మండలంలో ఖాళీగా ఉన్న అయిదు రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి చీపురుపల్లి ఆర్డీఓ సత్యవాణి గురువారం నోటి ఫికేషన్ జారీ చేశారు. మండలంలో ఖాళీలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ వివరాలు..రాచగుమడాం (ఓసీ), సాతాంవలస(బీసీ-ఈ), గర్భాం డిపో-1 (బీసీ- ఏ డబ్ల్యూ), బుధరా యవలస డిపో-3 (ఓసీ),కొర్లాం డిపో డీలర్ పోస్టును ఓసీకి కేటాయించారు.

గుర్ల మండలంలో 5 పోస్టులకు

గుర్ల: మండలంలో నాలుగు కొత్త రేషన్ డిపోలకు, అచ్యుతాపురంలో ఖాళీ అయిన రేషన్ డీలర్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేందుకు చీపు రుపల్లి ఆర్డీఓ నోటిఫికేషన్ జారీ చేశారని తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం (ఎస్సీ), కొత్తరేషన్ డిపోలు చింతలపేట (ఓసీ- ఎక్స్ ఎస్ఎం), కెల్ల డిపో-3 (బీసీ-సీ), కెల్ల డిపో-4(ఓసీ), పెనుబర్తి డిపో డీలర్ పోస్టును ఎస్సీకి కేటాయించారు.

గంట్యాడ మండలంలో..

గంట్యాడ: మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీఎస్‌డీటీ మూర్తి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన నోటిఫికేషన్ విడుదల చేశారు. మండలంలోని నరవ -1,2 డిపోలు, కొర్లాం డిపో-2 డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అర్హతలు, దరఖాస్తు చేసుకునే విధానం:

- అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి. సంబంధిత రేషన్ డిపో పరిధిలో శాశ్వత నివాసి అయి ఉండాలి.
- రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అర్హులు ఈనెల 26వ తేదీలోపు చీపురుపల్లి ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి.
- చౌకధరల దుకాణాలకు కేటాయించిన సరుకులను ప్రతీ నెలా విడిపించుటకు తగిన ఆర్థికస్తోమత కలిగి ఉన్నట్లు స్వీయ డిక్లరేషన్‌ను దరఖాస్తుకు జతచేయాలి.
- దరఖాస్తుదారుడు పూర్తి ఆరోగ్యవంతుడుగా ఉండాలి, ఎలాంటి దీర్ఘకాలిక రోగాలు ఉన్నా అనర్హుడిగా గుర్తిస్తారు.
- ప్రభుత్వ ఉద్యోగులు (రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్) కుటుంబాల్లో వ్యక్తులు అనర్హులు.
- పోలీసు కేసులు, కోర్టు శిక్షలు ఉంటే అటువంటి వారి దరఖాస్తులను తిరస్కరిస్తారు.
- ఎంపికైన అభ్యర్థి మాత్రమే చౌకధరల దుకాణాన్ని నడపవలసి ఉంటుంది.
- మెరకముడిదాం, గుర్ల మండలాల వారికి జనవరి 5 వతేదీ ఉదయం 11గంటలకు చీపురుపల్లిలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తారు.
- పూర్తి వివరాలకు తహసీల్దార్ కార్యాలయాల్లో కానీ సంబంధిత సచివాలయాల్లో కాని సంప్రదించాలి.